క్లుప్తంగా

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు



వాజపేయి జయంతి నిర్వహిస్తున్న సర్పంచ్

కాళ్ల: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతి వేడుకలు బుధవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాళ్ల మండలం కోలనపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు, సర్పంచ్ కొణకంచి సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా నాట్లు



దాళ్వా నాట్లు వేస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో దాళ్వా నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ పంట నష్టం వాటిల్లిన వరి చేలల్లోనూ, మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో నాట్లు ప్రారంభించారు. సిద్దాపురం, రాజులపేట, కోళ్లపర్రు, తదితర గ్రామాల్లో వెదజల్లు పద్ధతిలో దాళ్వా సాగు చేపట్టారు. దాళ్వా సాగులో ఎంటీయూ 1121, ఎంటీయూ 1010, 1153,1156, 1210, 3626 వంగడాలతో పాటు నెల్లూరు సన్నాలు 3449, ఐఆర్ 64, ఎల్ఎల్ఆర్ 3354 రకాలను సాగు చేసేందుకు పలుచోట్ల నారుమడులు వేశారు. గత 15 రోజులుగా వాతావరణం చల్లబడి, చిరుజల్లులు పడటంతో పాటు పంట కాలువల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో దమ్ము పనులు కొనసాగుతున్నాయి. ముంపు ప్రాంతాల్లోని తూడు, గడ్డిజాతి మొక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. దమ్ముకు అనుకూలంగా పొలం ఎండకపోవడంతో నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్సీ గోపిమూర్తి



భీమవరంలో కళ్లు తిరిగిపడిపోయిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్ వంతెనపై బుధవారం ఉదయం పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు అనే మెకానిక్ కళ్లు తిరిగి పడిపోవడం జరిగింది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి వెంటనే వెంకటేశ్వరరావును పైకి లేపి కూర్చోబెట్టి మంచినీరు అందజేశారు. అనంతరం ఆరోగ్యంపై పలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్సీ గోపిమూర్తిని పలువురు ప్రశంసించారు.

వైభవంగా వాసవీ హోమం



వాసవీ శాంతిధాంలో పూజలు నిర్వహిస్తున్న కర్ణాటక వాసులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం కర్ణాటక భక్తులు వాసవీ పూజలు, వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా సాయి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, మరకత వాసవీ మాతలకు పూజలు, అభిషేకంలు నిర్వహించిన అనంతరం వాసవీ హోమం వేడుకగా నిర్వహించారు.

బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం



ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

పాలకొల్లు అర్బన్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ, రాజమహేంద్రవరంలో ఈ నెల 21న జరిగిన ఇంటర్ కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో శ్రీ ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి ఎ.జగదీష్ ద్వితీయ స్థానం సాధించారు. జగదీష్ ఎంఏ ఎకనామిక్స్ (ప్రథమ) చదువుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, పీడీ జి.మహేష్ తదితరులు జగదీష్‌ను అభినందించారు.

రబీ సాగులో రైతులు బిజీ

- గ్రామాల్లో వరినాట్ల హడావుడి
- అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు



దిరుసుమర్రులో వరి పొలాలను దున్నుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: జిల్లాలోని రైతులు రబీ వరిసాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తికావడంతో రబీ పనులతో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు జోరుగు సాగుతున్నాయి. చీడపీడలను అధిగమించి, అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవడంతో పాటు నారుమళ్లు వేయడం, పెరిగిన నారుతో నాట్లు పనులు ఊపందుకున్నాయి. అయితే వ్యవసాయంలో సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, కొమరాడ, చినఅమిరం, రాయలం, అనాకోడేరు, భీమవరం గునుపూడి, కొవ్వాడ అన్నవరం తదితర గ్రామాలలో సుమారు 8 వేల ఎకరాలలో దాళ్వా సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారు.

అనేక ప్రయోజనాలు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. సాగు పనులు ప్రారంభించినప్పటికీ నుంచి వీటిని చేపట్టాలి. తద్వారా పంటను చీడపీడలు, తెగుళ్ల ఆశించకపోవడంతో పాటు భూమికి సారం లభిస్తుంది. పంటలు ఏపుగా పెరుగుతాయి.

అధికంగా ఎరువులు వాడితే నష్టమే..

పంట ఏపుగా పెరగాలని, దిగుబడి ఎక్కువగా రావాలనే ఉద్దేశంతో కొందరు రైతులు తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను విపరీతంగా వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి బాగా పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. పరిమితికి మించిన ఎరువుల వాడకం వల్ల నష్టం కలుగుతుంది. పొలంలో భూసార పరీక్షలు చేయించి, ఆ నివేదికలో వెల్లడైన అంశాల ఆధారంగా ఎరువులు వాడాలి. తద్వారా భూమికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈవారంలో మరికొందరు రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దమ్ముచేసి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. అయితే విచిత్రంగా మండలంలో మెజార్టీ రైతులు ఇంకా నారుమడులు తయారీలోనే ఉన్నారు. కొన్ని చోట్ల విత్తనాలు చల్లుతున్నారు. మరో వారం రోజుల్లో మొత్తం నారుమడులు పూర్తి చేసే అవకాశం ఉంది. మొత్తంమీద వచ్చే నెలాఖరుకు దాళ్వా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. సంక్రాంతికి నాటికే నూరుశాతం నాట్లు పూర్తిచేయాలన్న లక్ష్యంతో వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

వెదజల్లే పద్ధతి మేలు

రైతులు నారుమడులు వేయలేని, వరి నారు దొరకని రైతులు వెదజల్లే పద్ధతి అనుసరిస్తే సాగులో సుమారు రూ. 4 వేలు వరకు ఆదా అవడమే కాకుండా రెండు వారాలు ముందుగా వరి కోతకు వస్తుందని వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెబుతున్నారు.



నారుమడిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్

త్వరగా నాట్లు పూర్తిచేయాలి



వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులు త్వరగా నారుమడులు పూర్తిచేయాలి. ఈనెలాఖరుకు నాట్లు పూర్తిచేయడానికి యత్నించాలి. కనీసం జనవరి మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. రబీసాగుకు స్వల్పకాలిక విత్తనాలు సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయి.

నిమ్మల శ్రీనివాస్,
వ్యవసాయాధికారి, భీమవరం మండలం

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం



జల్లా కొండయ్య

భీమవరం అర్బన్: కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ జల్లా కొండయ్య బుధవారం పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు సోలార్ విండ్ ఐడల్ ప్రాజెక్టులను వాడుకుంటూ ఒక్కపైసా కూడా చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచేయడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలలలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపిందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యుత్ చార్జీల యూనిట్ రూ.2.90 పైసలు ఉంటే నేడు రూ.4.80 పైసలకు చంద్రబాబు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కృష్ణంరాజుకు శుభాకాంక్షలు

పాలకోడేరు: పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కునాధరాజు మురళీకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాలకోడేరు మండల గౌడ సంఘం నాయకులు బుధవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా మురళీ కృష్ణంరాజును ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల గౌడ సంఘం పెద్దలు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి బుధవారం భీమవరానికి చెందిన దుష్యంత్ కుమార్, అరుణకుమారి దంపతులు 24 గ్రాముల బంగారం ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అమ్మవారికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ

నరసాపురం: పార్లమెంట్ మాజీ సభ్యుడు, కమ్యునిస్ట్ ఉద్యమ నిర్మాణ ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఏర్పాటు చేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు తెలిపారు.

శ్రీరామ భక్తాంజనేయ స్వామికి విశేష పూజలు



భక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని నందమూరి గురువులో శ్రీరామ భక్తాంజనేయ స్వామి 59వ వార్షికోత్సవం బుధవారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సింధూర, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్న సమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. మేకల వెంకట చలపతి, ఏసురాజు, కె.శ్రీనివాసరావు, కె.రుషికేసు దామోదర్ రావు, వడ్డీ కనకదుర్గా ప్రసాద్, కె.శ్యామలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలతో 'కూటమి' బాదుడు

- విద్యుత్ బాదుడికి బోరుమంటున్న ప్రజలు
- 27న ధర్నాను విజయవంతం చేయండి



ఆకివీడు: విద్యుత్ చార్జీల పెంపుపై ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలు బోరుమంటున్నారని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు ఆరోపించారు. ఈ నెల 27వ తేదీన స్థానిక సబ్ స్టేషన్ వద్ద నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ ధర్నా సందర్భంగా బుధవారం జెడ్పీటీసీ వెంకట్రాజు నివాసం వద్ద ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆక్వా రంగానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. లోకేష్ పాదయాత్రలో ఆక్వా పరిశ్రమకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదన్నారు. మేత ధరలు తగ్గిస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు సామాన్యుడికి భారంగా ఉందన్నారు. అద్దె ఇళ్లల్లోని/ పేదలకు అద్దె కన్నా కరెంట్ బిల్లే అధికంగా వస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలును ప్రభుత్వం విస్మరించిందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇప్పటికే సంక్షేమ పథకాలు అందుకుని ప్రజలు, మహిళలు చిరునవ్వులతో పండుగలు చేసుకునేవారన్నారు. ఆ పరిస్థితి నేడు లేదని విమర్శించారు. 2040 విజన్ అంటూ మాయమాటలు చెప్పారన్నారు. 75000 కోట్ల అప్పులు చేసి ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదని సీతారామయ్య విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రోజు రోజుకూ పెరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీల బాదుడు ప్రజలను తీవ్రంగా వేధిస్తుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో 27వ తేదీన నియోజకవర్గ స్థాయిలో ఆకివీడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, నిమ్మల నాగు, ఎండీ.ఆలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్యెం కృష్ణ, చిక్కాల రామాంజనేయులు (చిన్నా), నాతిరెడ్డి అన్నవరం, మెంటే లక్ష్మణరావు, అల్లూరి తమ్మిరాజు, కత్తుల శ్రీనివాస్, భూపతిరాజు బుజ్జిరాజు, చిట్టిబొమ్మి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



భీమవరంలో సీపీఐ శత వార్షికోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాలను పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారని భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులను కాల్చి చంపారన్నారు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజ సాధన దిశగా వందేళ్లుగా సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, వై జోయల్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పునః ప్రారంభం



పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: వెంకయ్య వయ్యేరు పంట కాలువకు సమాంతరంగా రూ.30 కోట్లతో చేపట్టిన పైప్‌లైన్ పనులు పునః ప్రారంభించారు. గత రెండు దశాబ్దాలుగా పైప్‌లైన్ పనులు మూలనపడ్డాయి. నిడదవోలు కాలువ నుంచి పరిమళ్ల లాకుల వరకూ ఉన్న ప్రధాన పంట కాలువ నుంచి వెంకయ్య వయ్యేరు పంట కాలువకు వచ్చే నీరు కలుషితమవ్వడంతో నేరుగా నీటిని పైపుల ద్వారా సరఫరా చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.30 కోట్ల నిధులు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ పాతపాటి సర్రాజు యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ ఆ తరువాత ఎమ్మెల్యే మారడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. ప్రధాన పైప్‌లైన్ నుంచి గ్రామాలను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ల నిర్మాణం, ఓహెచ్ఎస్ఆర్, సంప్‌ల నిర్మాణం పూర్తయింది. తరువాత వచ్చిన ఎమ్మెల్యే పైప్‌లైన్ పనులను పట్టించుకోలేదు. ప్రస్తుతం వెంకయ్య వయ్యేరు పంట కాలువలో నీరు పూర్తిగా కలుషితమైపోయి ప్రవహిస్తుందని, సెలినిటీ శాతం పెరిగిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడంతో పనులను పునఃప్రారంభించేందుకు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చర్యలు చేపట్టారు. పరిమళ్ల లాకుల నుంచి చినకాపవరం ఓహెచ్ఎస్ఆర్ వరకూ పైప్‌లైన్ పూర్తి కండిషన్‌లో ఉంది. అక్కడి నుంచి ఏలూరుపాడు లాకుల వరకూ పైప్‌లైన్‌లో లోపాలను సరిజేసేందుకు చర్యలు చేపట్టారు. చినకాపవరం ఓహెచ్ఎస్ఆర్ వద్ద జాయింట్ పనులను బుధవారం చేపట్టారు.

పోరుబాటను విజయవంతం చేయండి



చవ్వాకుల సత్యనారాయణ

వీరవాసరం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సీపీ మండల అధ్యక్షులు చవ్వాకుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్తు వినియోగదారులపై 15,486 వేల కోట్ల భారాన్ని మోపిందన్నారు. ఎన్నికల హామీల్లో విద్యుత్ పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇలా ప్రజలపై మోపుతున్న భారాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దోపిడీనే అజెండాగా కూటమి పాలన

నరసాపురం: దోచుకో పంచుకో అన్న చందంగా దోపిడీనే ప్రధాన అజెండాగా రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు బుడితి సుమన్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పెంచి విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన ఆందోళనలను నియోజకవర్గాల్లోని ఐటీ వింగ్ నాయకులు జయప్రదం చేయాలని సూచించారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన అదనపు భారాల తాలూకా వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి సర్కార్ పూర్తిగా మరిచిపోయిందన్నారు. తనను రెండో పర్యాయం ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడుగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు చెప్పారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

భీమవరం అర్బన్: దేవాది దేవుడు, కరుణామయుడు, లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు సమాజంలో ప్రజల మనుగడకు ఎంతో అవసరమని పాస్టర్లు పి. సాల్మన్‌రాజు, రేవు శాంతరాజు అన్నారు. భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో బుధవారం క్రిస్టమస్ వేడుకలలో 35 కేజీల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు, శాంతరాజు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, త్యాగం వంటి గొప్పతనాన్ని ఏసు క్రీస్తు బోధనలు ద్వారా సమాజానికి అందజేశారని తెలిపారు. అనంతరం క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక గీతాలపనలు ఆలపించారు. మండలంలోని దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, వెంప, తుందుర్రు, కొత్తపూసలమర్రు, చినఅమిరం తదితర గ్రామాలలో చర్చిలలో క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఆకివీడు: క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి, క్రైస్తవ సోదరులు ఒకరికొకరు శుభాకంక్షలు చెప్పుకున్నారు. స్థానిక హోప్ బాప్టిస్టు చర్చి, సెంట్రల్ బాప్టిస్టు చర్చి, 139 ఏళ్ల నాటి పురాతన సీబీసీఎన్‌సీ ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ టౌన్ చర్చి, పలు గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు. మహిళలు, యువతులు ప్రత్యేక క్రిస్మస్ గీతాలు పాడారు. ఈ సందర్భంగా పాస్టర్లు గూడపాటి జోసఫ్‌రాజు, సీహెచ్. జార్జి, పి.సత్యానందం మాట్లాడుతూ క్రీస్తు జననం లోకంలోని మనుషుల పాపం నుంచి విడుదలకు దివి నుంచి భూమికి దిగి వచ్చిన దేవుడి కుమారుడు అన్నారు.



కాళ్ల: కేక్ కట్ చేస్తున్న పీవీఎల్ నరసింహరాజు



భీమవరం(ప్రకాశం చౌక్): రూపాంతర దేవాలయంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాళ్ల: మండలంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో అన్ని చర్చిలను ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున క్రిస్మస్ సంబరాలు నిర్వహించి క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ అంటూ నినాదాలు చేశారు. ప్రధానంగా చర్చిల్లో పాస్టర్లు సీఆర్‌లు ప్రత్యేక ప్రార్ధన నిర్వహించి క్రీస్తు పుట్టుక గురించి తెలియజేశారు.

క్రైస్తవ సోదరులకు పీవీఎల్ శుభాకాంక్షలు

క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులను నింపాలని క్రీస్తు జన్మదిన వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, మంతెన సునీల్ వర్మ, బిరుదుగడ్డ గంగాధర్, గుర్రం బెనహర్, మోసాల అశోక్, సాంసంన్, యాకోబు, క్రైస్తవ సోదరులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వీరవాసరం: ప్రభువైన ఏసుక్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని మాజీ మంత్రి పీతల సుజాత తెలిపారు. వీరవాసరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని బుధవారం ఆమె మాట్లాడారు. ప్రేమ, దయ, కరుణ సేవ కలిగి ఉండి కులమత వర్గ విభేదాలు దూరంగా ఉండాలన్నారు. క్రిస్మస్ కేకును కట్ చేసి పంపిణీ చేశారు. వీరవాసరం మండలంలో ఉన్న అన్ని చర్చల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభువైన ఏసుక్రీస్తు వారి ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరి పైన ఉండాలని ఆకాంక్షించారు. చర్చలన్నిటిని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.

పట్టణంలో పలు చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. వందలాది మంది విశ్వాసులు క్రిస్మస్ వేడుకల్లో, ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని రూపాంతర దేవాయలం, లూథరన్ చర్చిల్లో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలి

భీమవరం: క్రిస్మస్ కరుణ, త్యాగానికి ప్రతీకని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డులోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో కోళ్ల నాగేశ్వరరావు, పాతర్తూరి బాపిరాజు, గంటా త్రిమూర్తులు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బేతని చర్చిలో క్రిస్మస్ వేడుకలు

భీమవరం: భీమవరం పట్టణంలోని బేతనిచర్చిలో క్రిస్మస్ పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ఎస్ డేనియేల్ పుష్పరాజ్ కేక్ కట్‌చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టా దేవరాజ్, వర్గీస్ డానియేల్, బందెల సునీల్, గంటా సుందరకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.



ఆకివీడు: కేక్ కట్ చేస్తున్న పాస్టర్ పి.సత్యానందం



వీరవాసరం: క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



భీమవరం అర్బన్: దొంగపిండిలో భారీ కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం